ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 14 మార్చి, 2026 | పేజీలు : 08




అనుసంధాన సమన్వయ సెరికల్చర్ సాగుతో హ్యాండ్లూమ్ ఎనలేని అభివృద్ధి

2



# కోతలకు వచ్చిన వరి పొలాలు..
# కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఎప్పుడో?

## ధాన్యం కొనుగోలు కేంద్ర్రాల ఏర్పాటు కోసం రైతుల ఎదురుచూపు

**ప్రజాపక్షం/నిడమనూరు:** రైతులు ఆరుగాలం కష్టంచి చీడపీడలు ఎదుర్కొని పండించిన పంట చేతికి వచ్చేందుకు సిద్ధంగా ఉండగా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారో అన్న ఆందోళన రైతుల్ని వేధిస్తుంది. సన్నధాన్యం సాగు చేస్తే చీడపీడల్ని తట్టుకోలేమని దొడ్డు రకం దాన్యాన్ని వేసవిలో రైతులు అత్యధికంగా సాగు చేశారు. మునుపెన్నడు లేని విధంగా దొడ్డు రకం ధాన్యానికి ఈసారి అగ్గి తెగులు, పసుపు ఉండలు, మెడ విరుపు లాంటి చీడపీడలు సోకడంతో రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు, తీరా పంట చేతికి వచ్చే సమయానికి
ధాన్యం
కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులు తేల్చి చెప్పకపోవడం రైతులని ఆందోళనకు చేస్తుంది, గత సీజన్‌లో పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా 74వేల క్వింటాల ధాన్యం కొనుగోలు చేయగా,ఐకెపి కేంద్రాల ద్వారా 80 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు, మండలంలో సుమారు 36వేల ఎకరాలలో వరి స్సాగు చేయగా ఉగాది నాటికి కోతలు మొదలుకావచ్చుమని రైతులు చెప్తుండగా, మార్చి నెలాఖరుకు కానీ ఏప్రిల్ మొదటి వారంలో కానీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు, పిఎసిఎస్ ఆధ్వర్యంలో మండలంలో కనేకల్, వేంపాడు, నిడమానూరు మార్కెట్ యార్డ్‌లో రెండు (ఒకటి సన్న రకం) మొత్తం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు

తరువాయి 2లో...



# పది పరీక్షలకు సర్వం సిద్ధం

## జిల్లాలో 109 కేంద్రాలు
## 19,835 మంది విద్యార్థులు
## ప్రశ్నపత్రాల భద్రతకు పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరగనున్న ఈ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 109 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) భిక్షపతి తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా మొత్తం 19,835 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో రెగ్యులర్ విభాగంలో 19,698 మంది, ప్రైవేట్ విభాగంలో 137 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.ప్రశ్నపత్రాల భద్రత కోసం ఆయా పరీక్షా కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక భద్రపరిచే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు జిల్లాలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ

తరువాయి 2లో...



2

# శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



# వంటగ్యాస్ కొరతతో మళ్లీ వెలుగులోకి కట్టెల పొయ్యిలు

## సిలిండర్ కోసం క్యూలు... వంటల కోసం కట్టెలు.. వినియోగదారుల కష్టాలు

**ప్రజాపక్షం/నల్లగొండ:** దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ల కొరత ప్రభావం నల్లగొండ జిల్లాలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. గ్యాస్ సరఫరా ఆలస్యమవడంతో గృహిణులు, చిన్న హోటల్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు నిర్వహించే వారు రోజువారీ వంటల కోసం గ్యాస్ సిలిండర్లపై ఆధారపడుతుండగా, ప్రస్తుతం సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే అనేక చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు కట్టెల పొయ్యిలపై వంటలు ప్రారంభించాయి. ఉదయం అల్పాహారం నుండి మధ్యాహ్న భోజనం వరకు వంటలు చేయడానికి కట్టెలు సేకరించడం, పొయ్యి వెలిగించడం వంటి పనులు నిర్వాహకులకు అదనపు భారంగా

తరువాయి 2లో

# కోతలకు వచ్చిన వరి పొలాలు... కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఎప్పుడో?

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నప్పటికిని, కనేకల్ వేంపాడు కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ భూమి లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల భూములకు అనుమతులు తీసుకోవడంలో జాప్యం జరుగుతుందని సిఓ జానయ్య తెలిపారు. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసే ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మారుపాక, ఊట్కూర్, నందికొండ వారి గూడెం,ముప్పారం,ఇంద్ల కోటయ్య గూడెం, గ్రామాలలో మొత్తం ఐదు సెంటర్లను మార్చి నెలాఖరులో కానీ ఏప్రిల్ మొదటి వారంలో కానీ ఏర్పాటు చేస్తామని అందుకోసం మహిళా సంఘాలను సమన్వయం చేయడం జరుగుతుందని ఏపీఎం నరహరి తెలిపారు. ఏమైనాప్పటికిని కొనుగోలు కేంద్రాల్లో సెంటర్ల నిర్వాహకులు రైతులని ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కోసం జిల్లాలో మొత్తం 1,082 మంది ఇన్విజిలేటర్లు, 109మంది సెంటర్ సూపరింటెండెంట్లు,109 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు నియమించబడ్డారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయి.

**ఈసారి నిమిషం నిబంధన తొలగింపు**

ఈసారి నిమిషం నిబంధనను తొలగించి విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను ఐదు నిమిషాలలోపు పరీక్షకు అనుమతిస్తారు. ఈసారి ప్రతి పరీక్షా కేంద్రం బయట క్లాక్‌రూమ్ ఏర్పాటు చేయడం ప్రత్యేకతగా నిలిచింది. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను అక్కడ భద్రపరచేందుకు టోకెన్ విధానాన్ని అమలు చేయనున్నారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల వద్ద డీఈఓ, ఎంఈఓ ఇతర అధికారుల ఫోన్ నంబర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు.

# శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇమాంపేట కెజిబివి పాఠశాలలో విద్యార్థులు కోతులతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పడంతో ఆయన స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డి సహకారంతో రూ.1.20లక్షల వ్యయంతో నిర్మించిన మంకీ ప్రొటెక్షన్ గ్రిల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూరిభా మైనార్టీ బాలికల విద్యాలయానికి కూడా స్ప్రెడ్ ఇండియా సేవా సంస్థ దత్తత తీసుకొని అనేక రకాల అభివృద్ధిని చేయడం జరిగిందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను కూడా అందజేశారు. సిఎం రేవంత్ రెడ్డి పాలనలో విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఎంఇఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, జిసిడిఓ పూలందేవి, ప్రిన్సిపాల్ డి నారాయణ పాల్గొన్నారు.

# వంటగ్యాస్ కొరతతో మళ్లీ వెలుగులోకి కట్టెల పొయ్యిలు

(మొదటిపేజీ తరువాయి)

మారాయి. గ్యాస్‌తో తక్కువ సమయంలో పూర్తయ్యే వంటలు, కట్టెల పొయ్యిలతో ఎక్కువ సమయం తీసుకోవడంతో వినియోగదారులకు కూడా ఆలస్యంగా సేవలు అందుతున్నాయి.ఇక గృహ వినియోగదారుల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. గ్యాస్ ఏజెన్సీల వద్ద సిలిండర్ కోసం పలువురు వినియోగదారులు రోజులు ఎదురుచూడాల్సి వస్తోందని చెబుతున్నారు. బుకింగ్ చేసినా సరఫరా ఆలస్యమవుతుండడంతో గృహిణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తాత్కాలికంగా కట్టెల పొయ్యిలు, ఎలక్ట్రిక్ స్టవ్‌లను ఉపయోగిస్తూ వంటలు చేస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ సరఫరా ఎప్పుడు సాధారణ స్థితికి వస్తుందో తెలియక వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే సిలిండర్ల సరఫరాను మెరుగుపరచాలని, వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరుతున్నారు.

**గ్యాస్ సిలిండర్లు దొరకక హోటళ్లలో కట్టెల పొయ్యిలే ఆధారం: హోటల్ యజమాని మహమ్మద్ షఫీ**

దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా మారడంతో చిన్న హోటళ్ల నిర్వహణ కష్టసాధ్యంగా మారిందని నల్లగొండకు చెందిన హోటల్ యజమాని మహమ్మద్ షఫీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్లు సమయానికి అందకపోవడంతో హోటల్‌లో వంటలు చేయడం చాలా కష్టంగా మారిందని తెలిపారు. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో తప్పనిసరిగా కట్టెల పొయ్యిలపై వంటలు చేయాల్సి వస్తోందని కట్టెలతో వంట చేయడం వల్ల ఎక్కువ సమయం పట్టడంతో పాటు ఖర్చు కూడా పెరుగుతోందని ఆయన వివరించారు.

# అనుసంధాన సమన్వయ సెరికల్చర్ సాగుతో హ్యాండ్లూమ్ ఎనలేని అభివృద్ధి

సెరికల్చర్ సీనియర్ సైంటిస్ట్ డా.దయానంద

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అనుసంధాన సమన్వయ సెరికల్చర్ సాగుతో హ్యాండ్లూమ్ ఎనలేని అభివృద్ధి సాధ్యమవుతుందని మైసూర్ సెరికల్చర్ సీనియర్ సైంటిస్ట్ దయానంద స్పష్టం చేశారు. ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, టిఎస్‌ఆర్‌టిఐ కేంద్ర పట్టు మండలి, జౌళి మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ములుగు సిద్దిపేట సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పోచంపల్లి పట్టణంలో పట్టు కృషి మేళ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టు పరిశ్రమలో నూతన ఆవిష్కరణలు అనే థీమ్‌తో జరిగిన సదస్సులో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పట్టు సాగు చేసే రైతులు పట్టుగూళ్ళ పెంపకం దారులు, రీలింగ్ వ్యాపారులు, మాస్టర్ వీవర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి పట్టు సాగు అత్యధిక దిగుబడి, మెలకువలు లాభదాయకమైన వ్యాపారం పాటించవలసిన జాగ్రత్తలు పట్టుపురుగుల పెంపకం వంటి అంశాలపై సైంటిస్టులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టు సాగు, నాణ్యమైన పట్టుగుళ్ళు, రీలింగ్ పెంపకం, అధిక దిగుబడి, 100 శాతం ఉత్పత్తి సాధించిన ఉత్తమ రైతులను జిల్లాల వారీగా అవార్డులతో ఘనంగా సన్మానించారు. మూడు సెషన్లలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. సైంటిస్టులు చూపిన విధంగా సూచనలు మేరకు పట్టు సాగు రైతులు నడుచుకొని దిగుబడులు ఉత్పత్తులు సాధిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ప్రోత్సాహకాలు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ గజం గోవర్ధన్, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ లత, అనసూయ, సీనియర్ శాస్త్రవేత్తలు మైసూర్ జోయిశత రాణి, డా.మల్లికార్జున్, ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వినోద్ కుమార్, పోచంపల్లి శ్రీరంజన్ యూనిట్ అధినేత ఎన్నెం శివకుమార్, చిక్క కృష్ణ చింతకింది రమేష్, అంకం పాండురంగం, వివిధ జిల్లాల నుండి చేనేత కార్మికులు ముఖ్య నాయకులు, పట్టు సాగు రైతులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చండూరుని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు



**ప్రజాపక్షం/చండూరు :** చండూరు మున్సిపాలిటీని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సహకారంతో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చండూరు పట్టణ ప్రజలకు అదే విధంగా చండూరుకు వివిధ అవసరాల నిమిత్తం ఇతర గ్రామాల నుండే వచ్చే ప్రజల సౌకర్యార్థం కొత్త అస్సిరేషనల్ టాయిలెట్‌ను మెయిన్ సెంటర్ నందు నిర్మాణమునకు ప్రారంభోత్సవం చేశారు. తదుపరిమున్సిపాలిటీ ఆఫీస్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బందికి హెల్త్ క్యాంప్‌తో పాటు పిపిఈ కిట్లు ,సబ్బులు పంపిణీ చేశారు. ఇదే విధంగా సాయిబాబా దేవాలయం వద్ద, బస్టాండ్ వద్దనున్న వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ప్రతి కార్యక్రమాన్ని విధిగా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో చండూరు మున్సిపాలిటీని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కమీషనర్ మల్లేశం, పి హెచ్‌సి వైద్యుడు డాక్టర్ మాస రాజు, కౌన్సిల్ సభ్యులు తేలుకుంట్ల రాజకుమారి ,బుషిపాక వాసు, సామ సుజాత, జెల్ల ధనమ్మ, కొండ్రెడ్డి మధు, కోడి సుష్మా వెంకన్న, కలిమికొండ పారిజాత కటకం రమేష్, వార్డు ఆఫీసర్స్ రాములు, సాయి రామ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అరవింద్ రెడ్డి, ఎన్ఎంలు, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 144 సెక్షన్ అమలు

ఎస్ఐ మునుగోటి రవీందర్

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ సందర్భంగా కట్టంగూరు మండల కేంద్రంలో ఈ నెల 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు 144వ సెక్షన్ విధించినట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.టెన్త్ పరీక్షల దృశ్య 144సెక్షన్ (బిఎన్ఎస్ 163) అమలు చేయాలని స్థానిక తహసిల్దార్ పుష్పలత ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సెక్షన్ ను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ రోజున స్థానిక జిరాక్స్ సెంటర్లు మధ్యాహ్నం రెండు గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు.

# ఆకులు లేని చెట్టు.. పూల పొదరిల్లు!



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రకృతి తన ఒడిలో దాచుకున్న అద్భుతాలను ఒక్కో కాలంలో ఒక్కోలా ఆవిష్కరిస్తుంది. వేసవి ఆరంభ వేళ అడవులు, రహదారుల వెంట చెట్లు ఆకులు రాల్చుతూ వెలవెలబోతుంటే, కొన్ని చెట్లు మాత్రం అపురూపమైన పూలతో కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. కేతేపల్లి సమీపంలోని జాతీయ రహదారి65 వెంట ఉన్న ఒక టబెబుయా చెట్టు ప్రస్తుతం పసుపు వర్ణంతో ధగధగలాడిపోతోంది. సాధారణంగా చెట్లకు ఆకులు ఉంటేనే అందం. కానీ, ఈ చెట్టుకు ఒక్క ఆకు కూడా లేకుండా కేవలం పసుపు రంగు పూలతో నిండిపోయి ఒక పూల పొదరిల్లులా కనిపిస్తోంది. రహదారిపై వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఈ పసిడి పూల సోయగానికి ముగ్ధులవుతున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న సమయంలో, ఈ చెట్టు అందించే దృశ్యం బాటసారులకు ఎంతో ఆహ్లాదాన్ని, ఉపశమనాన్ని కలిగిస్తోంది. చాలామంది ప్రయాణికులు వాహనాలను ఆపి మరీ ఈ అద్భుత దృశ్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/చందంపేట :** గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం చందంపేట మండలంలోని మూర్పునూతల, బండమీది తండాలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. మూర్పునూతల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ అభివృద్ధి కోసం అందరూ పాటుపడాలని అన్నారు. చందంపేట మండల కేంద్రంలో కేజిబివి పాఠశాలలో రూ. 85.50లక్షల వ్యయంతో పిఎం శ్రీ పథకం కింద నిర్మించనున్న అదనపు తరగతి గదులు మరియు సైన్స్ ప్రయోగశాల, మరమ్మతు పనులను ప్రారంభించారు. మానావత్ తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, గ్రామ మహిళా సమాఖ్య సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, అధికారులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# గాయపడిన కార్యకర్తకు పరామర్శ

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రానికి చెందిన నకిరేకంటి కిషోర్ వ్యవసాయ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు పడిపోవడంతో ఆయన ఎడమ కాలు విరిగింది. ప్రస్తుతం వైద్యం చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కిషోర్‌ను ఎన్‌బిఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్ధార్థ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్, మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్య యాదవ్, టిడిపి రాష్ట్ర నాయకుడు జడ రాములు యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాగవెల్లి శంకర్, మాతంగి సుధీర్, దైద జాన్సన్, పుట్టల పాల్, రవి, కళ్ళు శ్రీను, పుట్టల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రీయ ఆలోచనలతోనే ఉజ్వల భవిష్యత్

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ ఒక అద్భుతమైన వేదిక అని ఎస్‌వి విద్యా సంస్థల చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. శుక్రవారం హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్ గర్ల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పదంతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రిన్సిపాల్ పుల్లూరి వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన నమూనాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌ఛార్జి గోవర్ధన్, ఉపాధ్యాయులు నాంచారయ్య, కన్నయ్య, రామయుడు, రవీందర్‌నాయక్, వెంకన్న, ఆంజనేయులు, దుర్గాప్రసాద్, రాజేశ్వరి, శాంతకుమారి, జ్యోత్స్న, సందీప్ పాల్గొన్నారు.

## పగడ్బందీగా పది పరీక్షలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/నూతనకల్ :** నేటి నుండి నిర్వహించే పదవ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాధికారి రాములు నాయక్ పరీక్ష నిర్వహణ అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి పరీక్ష నిర్వహణాధికారులకు, ఇన్విజిలేటర్స్‌కు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్స్ కట్ట కృష్ణయ్య, బాల్తు శ్రీనివాసు, డిపార్టుమెంట్ అధికారులు శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మల్లయ్యగౌడ్

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామంలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుక్రవారం సుద్దాల కాంగ్రెస్ పార్టీ మాజీ కోఆప్షన్ సభ్యులు దంతూరి మల్లయ్యగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తదితరులు అన్నారు.

## ఆశా కార్యకర్తల సమ్మె నోటీసు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆశా కార్యకర్తల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మార్చి 14నుండి విధులను బహిష్కరిస్తూ సమ్మె చేపట్టనున్నట్లు బిఆర్‌టియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్,ఆశాల సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుకలు తెలిపారు.నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా సిలివేరు ప్రభాకర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గర్భిణీ సర్వే లక్ష్యాలను రద్దు చేసి,ఉద్యోగ వివరాలలో ఉన్న పనులనే చేయించాలని కోరారు. ప్రతి నెల జీతాన్ని నెల మొదటి తేదీన చెల్లించే విధానం అమలు చేయాలని తెలిపారు. ఆశా కార్యకర్తలపై పెరుగుతున్న పనిభారం,మానసిక ఒత్తిడిని తగ్గించాలని, ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం నెల జీతాన్ని రూ.18,500కు పెంచి ఉద్యోగ భద్రత పథకాలు అమలు చేయాలని కోరారు. అర్హత కలిగిన ఆశా కార్యకర్తలకు అనుబంధ నర్సు ఉద్యోగాలకు అవకాశం కల్పించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, జ్యోతి, దుర్గ, పద్మ, ప్రమీల, సావిత్రి, వై. విజయలక్ష్మి పాల్గొన్నారు.

## నేటి నుండి పది పరీక్షలు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** పదవ తరగతి పరీక్షలు నేటి నుండి ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 16 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 12,364 మంది ఉండగా ఇందులో బాలురు 6,380, బాలికలు 5,984 ఉన్నారు. ఒకేసారి ఫెయిల్ అయిన విద్యార్థులు మొత్తం 39 మంది ఉండగా ఇందులో బాలురు 20, బాలికలు 19 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 కేంద్రాలను ఏర్పాటు చేయగా 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు, 69 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియామకం చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద గేట్ సమీపంలో ఉచితంగా విద్యార్థుల కోసం ఓ క్లాక్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు తీసుకరావద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రంలోనికి ప్రవేశ సమయం ఉదయం 9.30 నిమిషాలు కాగా గ్రేస్ టైం మరో 5 నిమిషాలు ఇచ్చారు. ఈలోపు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

## ఉపాధి కూలీలకు పని కల్పించడంలో అధికారులు చొరవ చూపాలి




**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంలో అధికారులు చొరవ చూపాలని పిఓ, కోదాడ ఏపిడి డాక్టర్ యామిని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై 16వ విడుత సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. మండలంలో 17 గ్రామ పంచాయితీల పరిధిలో 01 ఏప్రిల్ 2024 నుండి 31 మార్చి 2026 వరకు జరిగిన ఉపాధి హామీ పనులను ఆడిట్ నిర్వహించారు. ఈజిడబ్లు రూ.5,37,76,365, పిఆర్ రూ.2,90,17,804తో పనులు జరిగినట్లుగా అధికారులు తెలిపారు. రిసోర్స్ పర్సన్ సమక్షంలో సామాజిక తనిఖీ నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆడిట్‌లో వచ్చిన మొత్తం రికవరీ 10,200 ఫెనాల్టీ 1000 అన్నారు. మస్టర్‌లలో జరిగిన చిన్న చిన్న పొరపాట్లకుగాను పై అమౌంట్ రికవరీ నిర్వహించినట్లు తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని గ్రామాల సిబ్బందిపై ఏం చేస్తున్నారని మండలించారు. కూలీల హాజరు పట్టిక సక్రమంగా చేపట్టాలని పని ప్రదేశంలో కొలతల నిర్వహణ సక్రమంగా జరిగిన పనికి తగిన వేతనం కూలీలకు అకౌంట్ నంబర్లు సరి చూసుకున్న తర్వాతే ఫీల్డ్ అసిస్టెంట్లు అన్‌లైన్‌లో మస్టర్ల వారిగా పేరును పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ ఏలచ్చిరాం, సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎస్‌ఆర్‌పి రాజ్‌కుమార్, పిఆర్‌ఏఈ కుమారస్వామి, ఏపిఓ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సుధా బ్యాంక్ పనితీరుకు ఫైవ్ స్టార్ రేటింగ్ తార్కాణం



ఐఎఎస్ శిక్షకుడు ఆకెళ్ళ రాఘవేంద్ర

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సుధాబ్యాంక్ పనితీరుకు ఫైవ్ స్టార్ రేటింగ్ తార్కాణమని ఐఎఎస్ శిక్షకుడు ఆకెళ్ళ రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సుధాబ్యాంక్ 52వ సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ సుధా బ్యాంక్‌కు ఫైవ్ స్టార్ రేటింగ్ పురస్కారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధా బ్యాంక్ సాధించిన ఈ ఘనత సూర్యాపేట జిల్లాకే కాదు యావత్ తెలంగాణ రాష్టానికే గర్వకారణమన్నారు. అద్భుతమైన పనితీరుకు, క్రమశిక్షణకు ప్రామాణికంగా ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారని చెప్పారు. ప్రతి ఒక్కరు గర్వపడాలన్నారు. సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ నిర్వహణలో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ బ్యాంక్ అగ్రశ్రేణిగా ఎదగాలని ఆకాంక్షించారు. బ్యాంక్ చైర్మన్ మీలా మహాదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, డైరెక్టర్లు ఏపూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ మీలా సందీప్, అప్పం శ్రీనివాస్, తోట శ్యాం ప్రసాద్, డాక్టర్ మిన్నా విజయలక్ష్మి , అనంతుల శారదతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రజా అవసరాలు తీర్చడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రజా అవసరాలను మౌలిక వసతులను కల్పించడం తక్షణ సమస్య పరిష్కారాలను చూపడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 ద్వారా రూ.30 లక్షల నిధులతో శుక్రవారం పురపాలక సంఘ పరిధిలో మాధవరెడ్డి చౌరస్తాలో ఎస్సీ బాలికల హాస్టల్ దగ్గర నూతన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణమునకు శంకుస్థాపన చేసి నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఉండేందుకు హాస్టల్ అధికారులతో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. హాస్టల్ను తనిఖీ చేశారు. 12,13వ వార్డు కార్యాలయాలను ప్రారంభించారు. ముదిరాజ్ కులదేవత పెద్దమ్మ గంగమ్మ తల్లుల దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గౌస్కొండ గ్రామంలో జరుగుతున్న ఈదమ్మ తల్లి జాతరలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ చైర్ పర్సన్ తడక వెంకటేశ్వర్లు, కమీషనర్ డి.అంజన్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ కొయ్యడ రజనీ, కౌన్సిలర్లు కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య, బాత్క లింగస్వామి, కర్నాటి వరలక్ష్మి , రాపోలు కావ్య, దేవరాయ కుమార్, సూరేపల్లి రాధిక, పబ్లిక్ హెల్త్ డిఈ మనోహర, మేనేజర్ నిర్మల, సీ.అసిస్టెంట్ రాజేశ్ మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 24గంటలు నాణ్యమైన విద్యుత్ అందించాలి

బిజెపి మండల అధ్యక్షుడు యెల్లంల శ్రీదర్ రెడ్డి

**ప్రజాపక్షం/మోటకొండూరు :**రైతులకు 24 గంటలు లో వోల్టేజీ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని, కాంగ్రేస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని మోటకొండూర్ మండల బిజేపి అధ్యక్షులు యెల్లంల శ్రీదర్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం ఎఇకి అందజేశారు. అనంతరం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన కాదు చీకటి పాలన సాగుతుందని అన్నారు. ఆ ప్రకటిత విద్యుత్ కోతలతో రైతులకు చేతికి వచ్చే పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా బిజేపి నాయకులు పిసరి తిర్మల్ రెడ్డి, ఎల్లేష్ ముదిరాజ్, నర్సింహులు, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు పంపిణీ

**ప్రజాపక్షం/రామన్నపేట:**రామన్నపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినిలకు స్రైంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బత్తిని రాజు ఆర్థిక సహకారంతో పరీక్ష పాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాధికారి గవ్వ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. స్రైంత్ ఫౌండేషన్ ఫౌండర్ & చైర్మన్ ఎర్ర నరేష్ మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి జ్ఞానం సంపాదించుకోవాలని, విద్యే మనిషికి నిజమైన సంపద అని అన్నారు. పరీక్షలను ధైర్యంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆవుల సాయి, ఆవుల మత్స్యగిరి, అధ్యాపక బృందం మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘ 74వ వార్షికోత్సవం

**పజాపక్షం/రామన్నపేట :**యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామ చేనేత సహకార సంఘంలో 74వ వార్షిక, 80వ సాధారణ మహాసభను సంఘ ఇంచార్జి అప్పం రామేశ్వరం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా సంఘ భవనం దగ్గర పద్మశాలి చేనేత పతాకావిష్కరణ చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం అప్పం రామేశ్వరం మాట్లాడుతూ ఈ సమావేశంలో చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ మార్పు చేయాలని, అర్హులందరికీ నూతన జియో ట్యాగులు వేయాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సమావేశం తీర్మానాలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా పున్న రామలింగం పాల్గొనగా గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి, రాపోలు నిర్మల నరసింహ, రాపోలు వీరమోహన్, మాజీ ఎంపిటిసి బడుగు రమేష్, పున్న వెంకటేశం, అనూష, నరసయ్య, లక్ష్మమ్మ, జెల్ల లక్ష్మీనారాయణ, ఏలే నరసింహ, గుండు రాజు, రాపోలు రమేష్, పారిశ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామి హుండీ లెక్కింపు



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని శ్రీ మచ్చగిరి లక్ష్మీ నరసింహస్వామి వెంకటాపురం దేవస్థానం నందు శుక్రవారం భక్తులు సమర్పించిన కానుకలు హుండీ లెక్కింపు 4 నెలల 28 రోజులకు స్వామివారి కళ్యాణం 15,92,030, కట్నాలు కానుకలు, 25,828, నిత్య ప్రసాదాలు 13581 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో మోహన్ బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం మహాదేవపురం వారి పర్యవేక్షణలో జరిగినది ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట :** పట్టణ కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పారిశుద్ధ కార్మికుడు గాదే నరసింహ కుటుంబానికి సర్పంచ్ గరిక సత్యనారాయణ గ్రామపంచాయతీ నిధుల నుండి రూ .33 వేలు ఆర్థిక సహాయని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నరసింహ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోటే రమేష్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, వార్డు సభ్యులు, నాయకులు ఎండి అక్రమ్, జాడ సంతోష్, కొమ్ము శేఖర్, మోటె మహేష్, రామస్వామి, అన్వర్, సుదర్శన్, గొరిగే శేఖర్, బండ లింగస్వామి, ఉపేందర్, ఊట్కూరు శీను, గ్రామపంచాయతీ సిబ్బంది రాజ్ కుమార్, రాము, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక నివారణపై విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/రామన్నపేట :** అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రామన్నపేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివేకానంద మోడల్ స్కూల్లో స్థానిక అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మాత్తుగా ఏర్పడే అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తలు చర్యలు తీసుకుని విధానాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఫైటర్ రామనర్సయ్య, సిబ్బంది మీర్జా షఫీ బేగ్, మహేశ్వరం పాండు, ఆర్.సురేష్, జె.వెంకటేశం, పాఠశాల కరస్పాండెంట్ తిరుగుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు నాగరాజు, మాధవి, అమూల్య, విద్యాసాగర్, సాయి పాల్గొన్నారు.

# మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా పరీక్షలు రాయాలి



**ప్రజాపక్షం/రామన్నపేట :** ఎస్ఎఫ్ఐ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గత ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అందులో భాగంగా టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి కార్యక్రమం రామన్నపేట మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఎలాంటి భయాందోళనకు గురి అవ్వకుండా ఒత్తిడి లేకుండా ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని పరీక్షల సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని మొబైల్ ఫోన్స్ వాడొద్దని సరైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు పరీక్షలు రాసి వారికి, వారి తల్లి దండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, జిల్లాలో రామన్నపేట మండలం మొదటి స్థానంలో వచ్చే విధంగా విద్యార్థులు ప్రయత్నం చేయాలన్నారు. మండల స్థాయిలో మొదటి బహుమతి కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ విద్యార్థిని సుంచు ప్రణతి, ద్వితీయ బహుమతి వివేకనంద హై స్కూల్ కట్ట హరిణి సాధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు బుంగ చంటి, ఎరుముల శంకర్, భుఖ్య సంతోష్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల సీనియర్ సిటిజన్స్ మండల అధ్యక్షులు జెల్ల శ్రీరాములు అధ్యక్షతన జరిగిన రామన్నపేట మండలం సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశంలో ఆల్ సీనియర్ సిటిజన్స్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు నరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయని భూములు ఉన్నాయని కొంతమంది సీనియర్ సిటిజన్స్‌కు పెన్షన్ ఇవ్వని కారణంగా వారు నిరాదరణకు గురవుతున్న విషయాలు ప్రభుత్వం ఆలోచన చేయాలని అన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు రామన్నపేట మండలంలో ఎలాంటి ఇబ్బందులు జరిగిన మండల శాఖను సంప్రదించాలని వారి సమస్యలు పరిష్కారం కాని ఎడల రాష్ట్ర కమిటీ నుండి సమస్య పరిష్కారం అయ్యే విధంగా సీనియర్ సిటిజన్స్‌కు రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందని అన్నారు. ఈ యొక్క సమావేశంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా, సిరిపురం చేనేత సహకార సంఘం అధ్యక్షులు అప్పం రామేశ్వరం, సీనియర్ సిటిజన్స్ మండల కార్యదర్శి కూనూరు సుదర్శన్, సీనియర్ సిటిజన్స్ మండల ఉపాధ్యక్షులు మిర్యాల భాస్కర్, నాయకులు మిరియాల రామలింగం, రాపోలు లక్ష్మీనారాయణ, రాపోలు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా ఆసరా పెన్షన్ ఇవ్వాలి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** 2025–26 సంవత్సరం 10వ తరగతి వార్షిక పరీక్షలు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి సురేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 718 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 167 మంది, లిటిల్ బరడ్స్ ఉన్నత పాఠశాలలో 171 మంది, కిడ్స్ కింగ్డమ్ గ్రామర్ స్కూల్‌లో 190 మంది, మాంటిస్సోరి పాఠశాలలో 190 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాటు. ఈ పరీక్షలు మార్చి 14న ప్రథమ భాష తెలుగు, మార్చి 18న ద్వి తీయ భాష హిందీ, మార్చి 23న తృతీయ భాష ఇంగ్లీష్, మార్చి 28న గణిత శాస్త్రము, ఏప్రిల్ 2న సామాన్య భౌతిక శాస్త్రము, ఏప్రిల్ 7వ తేదీన సామాన్య జీవశాస్త్రం, ఏప్రిల్ 13తో సాంఘిక శాస్త్రంతో పరీక్షలు ముగుస్తాయని ఆయన తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అందుబాటులో ఉంటుందని విద్యార్థులు ఉదయము 9 గంటలకే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## చేనేత-పవర్‌లూమ్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2 వేల కోట్లు,పవర్‌లూమ్ రంగానికి రూ.2 వేల కోట్లు వేర్వేరుగా కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్,కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షుడు వర్కాల చంద్రశేఖర్ కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికుల త్రిఫ్ట్ పథకంలో కార్మికుడు రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 రికరింగ్ డిపాజిట్ చేస్తే ప్రభుత్వం వరుసగా రూ.2,400, రూ.1,600 జమ చేయాల్సి ఉన్నప్పటికీ రెండు నెలల తర్వాత గత తొమ్మిది నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయని తెలిపారు.చేనేత భరోసా పథకం ప్రకటించి రెండేళ్లు గడిచినా అమలు కాలేదన్నారు. నేతన్న భీమా పథకంలో 59 ఏళ్ల పైబడిన కార్మికులకు టీజీఎస్‌కో ద్వారా ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా ఏడాది దాటినా మరణించిన వారి కుటుంబాలకు అందలేదని తెలిపారు. గత బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడంతో హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్ విభాగాల్లో నిధుల కొరత ఏర్పడి పథకాలు అమలు కావడం లేదని, అందుకే వచ్చే బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

# నూనెగూడెంలో డ్రై ఫ్రైడే కార్యక్రమం

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో శుక్రవారం డ్రై ఫ్రైడే కార్యక్రమాన్ని మండల ఎంపిడివో చంద్రీరాణి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కుండీలు, డబ్బాల వంటి వాటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా దోమలు పెరగకుండా జాగ్రత్త పడవని మురుగు కాల్వలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపివో సలీం, పంచాయతీ సెక్రటరీ ప్రియాంక, నాయకులు పరుశరాములు, ఆశాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న క్యామ మల్లేష్

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని వెంకిర్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ లింగయ్య గౌడ్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు మంచాల రవి కుమార్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చింతల నాగలక్ష్మి లక్ష్మీనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ జిలకపల్లి లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్, టిఆర్ఎస్వి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నాగేష్, రాష్ట్ర గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుండబోయిన అయోధ్య యాదవ్, నాయకులు యాకరి యాదగిరి, జగన్, అజయ్, సిల్వేరు భాను ప్రసాద్ పాల్గొన్నారు.

## ఉద్దీపనలో విద్యార్థులే ఉపాధ్యాయులు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని వివిఎం ఉద్దీపన స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతుల్లో పాఠాలు బోధించడం ఆకట్టుకుంది. చిన్నారుల ఆత్మవిశ్వాసంతో చేసిన బోధనను ఆయన ప్రశంసించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణపెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,కౌన్సిలర్ గాజుల సుకన్య పన్నాల రాఘవరెడ్డి,యాస కరుణాకర్ ఈపాఠశాల ప్రధానోపాధ్యాయులు, భద్రయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుంతలు ఇలా.. ప్రయాణం ఎలా?

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలో పటేల్ నగర్‌లో సాయి శ్రీ వైన్స్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రద్దీగా ఉండే ఈ మార్గంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.బైపాస్ రోడ్డు దగ్గరలో కూడా పలుచోట్ల ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో ఇవి స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలతో అంతరాయం కలుగుతోంది.రహదారుల దుస్థితిపై అధికారులు స్పందించి వెంటనే గుంతలను పూడ్చివేయాలని ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు

## కాంగ్రెస్ పాలనలో చీకట్లో రైతుల బతుకులు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** కాంగ్రెస్ పాలనలో రైతుల బతుకులు చీకట్ల పాలవుతున్నాయని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇస్తానన్న 24 గంటల కరెంటు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చిమ్ముల రవీందర్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, రవిశంకర్, మోహన్ రావు, డాక్టర్ పాండు, పరమేష్ నాయక్, కమలాకర్ రెడ్డి, కుమార్, మధుసూదన్ రెడ్డి, బాల్ రెడ్డి, అరిగే శ్రీనివాస్, భాను చందర్ రెడ్డి, సందీప్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దారుగా చందర్‌రావు

**ప్రజాపక్షం/హాలియా:** అనుముల నూతన తహసీల్దార్‌గా బి.చందర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని మూసి రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పనిచేస్తున్న ఈయన బదిలీపై అనుముల తహసిల్దార్ వచ్చారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

## కవయిత్రి మొల్ల జీవితం ఆదర్శప్రాయం



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : కవయిత్రి మొల్ల మాంబ జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని సంస్థాన్ నారాయణపురం కుమ్మరి సంఘం అధ్యక్షుడు సిలివేరు నర్సింహ్ అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మొల్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమ్మరి సంఘం నాయకులు మాట్లాడుతూ ఇలాంటి విద్యాబుద్ధులు నేర్వకుండానే కవయిత్రి మొల్ల తెలుగులోకి రామాయణాన్ని అనువదించడం గొప్ప విషయం అన్నారు. పట్టుదల ఉంటే ఎలాంటి పని అయినా చేయవచ్చని మొల్ల నిరూపించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు చిలివేరు వెంకటేష్, సిలివేరు సైదులు, కేహెచ్‌పిఎస్ వ్యవస్థాపకులు చిలివేరు అంజయ్య, తెలంగాణ బిక్షం, లారీ బిక్షం, శంకర్, అంజయ్య, సంజీవ, బిక్షమయ్య, సోమయ్య, రమేష్ పాల్గొన్నారు.

## చట్టసభలో ఓంకార్ పాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ : చట్ట సభలో ఓంకార్ పాత్ర గోడ పత్రికను శుక్రవారం ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న రవీంద్రభారతి హైదరాబాద్‌లో జరిగే చట్టసభల్లో ఓంకార్ పాత్ర అనే అంశంపై నిర్వహించే రాష్ట్ర స్థాయి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీర తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వారోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. పేద వర్గాల అభ్యున్నతికి ఓంకార్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.సైదమ్మ, సహాయ కార్యదర్శి పోతుగంటి కాశీ, ఆశీర్వాదం, మల్లేష్, కమలమ్మ, సత్యం, ఉప్పలమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని మండల విద్యాధికారి సైదానాయక్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల వేషాధారణలో పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సైదానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తున్నామని తెలిపారు. సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ బాధ్యతగా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కౌన్సిలర్లు ధనమ్మ, ఉదయభాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు 50రూ.వేల కోట్లు కేటాయించాలి



ప్రజాపక్షం/కోదాడ : ఈనెల 20న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో బిసిలకు 50వేల కోట్లు కేటాయించాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. సోమవారం కోదాడలోని ఆర్డీవో కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన 21 హామీలలో ఒక్కటి కూడా అమలు జరగలేదని, ప్రతి బడ్జెట్‌లో 20వేల కోట్లు కేటాయించి ఐదు సంవత్సరాల్లో బిసిల అభివృద్ధికి లక్ష కోట్లు ఖర్చు చేస్తామని బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు ఇచ్చి, ఇప్పటికీ మూడు బడ్జెట్లు పూర్తయినా కనీసం 20వేల కోట్లు కూడా కేటాయించలేదని అన్నారు. ఇటీవల కాలంలో బిసి కులస్తులపై దాడులు పెరిగిపోతున్నందున బిసి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిసి హక్కులసాధన సమితి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని పలు సందర్భాల్లో కోరామని ఐనప్పటికీ పాలకులు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి నాయకులు ఇనుగుర్తి వెంకట రమణాచారి, నిగిడాల వీరయ్య, ఉప్పతల శ్రీనివాస్, సాదె నాగేశ్వరరావు, పరికె భరత్, చింత శ్రీనివాస్, చింత సంధ్య, బొడ్డుపల్లి మరియమ్మ పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం





ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు వివిధ వేషధారణలో చక్కగా రాణించారు. సీఎంగా, మంత్రులుగా, కలెక్టర్‌గా, డీఈవోగా, ఎంఈవోతోపాటు ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు చక్కని పాత్రను పోషించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ మాట్లాడుతూ విలువలతో కూడిన నైతిక విద్య వికాస అభివృద్ధి కోసం శ్రీ సరస్వతి విద్యాలయాలు పనిచేస్తున్నాయని అన్నారు. మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా విద్యా వికాసానికి తమ పాఠశాల పునాది వేస్తుందన్నారు. ఆంగ్ల భాషా నైపుణ్య వికాసం కోసం ప్రత్యేక శిక్షణను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం వివిధ వేషధారణలో అలరించిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, స్వాతి, మానస, శ్రావణి, జయ, నాగలక్ష్మి, సత్యవతి, పార్వతి, ప్రముఖ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాట్యమండలి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలి



ప్రజాపక్షం/మునగాల: కళ కళకోసం కాదు! కళ ప్రజల కోసం!! కళ ప్రగతి కోసం అనే నినాదంతో ముందుకు సాగుతున్న ప్రజానాట్యమండలి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూర రాంబాబు, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం లు అన్నారు. శుక్రవారం మండలంలోని నేలమర్రి గ్రామంలో జిల్లా 3వ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజానాట్య మండలి వేలాదిమంది కళాకారులను కదిలించి అక్షర సాంస్కృతిక ఉద్యమం నడిపింది. సారా వ్యతిరేక ఉద్యమంలో ఆటపాట వీధి నాటకాల ద్వారా ప్రచారంచేస్తూ ప్రజలను చైతన్యం చేసిందన్నారు. మూఢ నమ్మకాలు, సామాజిక అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజా ఉద్యమంలో మమేకమై ఆట, పాటలు, పల్లె సుద్దులు వీధి నాటకాలతో ప్రజలను చైతన్య పరుస్తున్నామని అన్నారు. ఈనెల 15న జిల్లా కేంద్రంలో జరుగు మహాసభలను జయప్రదంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూర ప్రసాద్, సుధాకర్, వెంకటేశ్వర్లు, రాములు, సాయిలు, ఉమా, మహేశ్వరి పాల్గొన్నారు.

## కుమ్మర తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి

ప్రజాపక్షం/తుర్కపల్లి : సంస్కృత రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి తెలుగు కవయిత్రి కుమ్మర్ల ఆడపడుచు శ్రీ మొల్లమాంబ జయంతి వేడుక తుర్కపల్లి మండల కుమ్మర సంఘం కమిటీ అధ్యక్షుడు దేవరుప్పుల ఐలయ్య ఆధ్వర్యంలో తుర్కపల్లి చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతిని నిర్వహించారు. కుమ్మరి కులానికి వన్నె తెచ్చిన రామాయణ రచయిత్రి మొల్లమాంబ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసంవత్సరం మార్చి 13న అధికారికంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, కోశాధికారి జాగిల్లపురం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అల్లదుర్గం కర్ణాకర్, ప్రచార కార్యదర్శి కె.కొండల్, జీవిలకపల్లి రాములు, తీగుళ్ల బాలక్రిష్ణ, ఇంద్రపాల కృష్ణ, రేణికుంట భాస్కర్, నాగాయపల్లి మల్లేష్, నాగాయపల్లి శ్రీనివాస్, పేరాల రాజు, ఆలేటి శ్రీశైలం, దుబ్బాక వెంకటేష్, బేతాల కనకయ్య, గణేష్, కిషన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్‌లో గ్రీన్‌వుడ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ఒలంపియాడ్ అవార్డుల ప్రధానోత్సవంలో హుజూర్‌నగర్ గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. శుక్రవారం హైదరాబాద్ నగరంలోని భారతీయ విద్యాభవన్‌లో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ జాతీయ స్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో 202526 విద్యా సంవత్సరానికి గానూ వైభవంగా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ వేడుకల్లో పురస్కారాలు బహూకరించారు. దీనిలో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లా విభాగాల్లో విజేతలుగా నిలిచి షీల్డ్, సర్టిఫికెట్స్ గెలుచుకున్నారు. వేణుగోపాల్, పి.రక్షక్, ఇషిత, సారిక, సుహాన్ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మార్రెడ్డి, డైరెక్టర్ తమ్మ సరిత, ప్రిన్సిపాల్ రాజారెడ్డి లు విజేతలను అభినందించారు.

## శీతాకాల ప్రత్యేక శిబిరం ముగింపు

ప్రజాపక్షం/మిర్యాలగూడ : స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో శీతాకాల ప్రత్యేక శిబిరం మండలంలోని గూడూరు, కృష్ణాపురం గ్రామాల్లో గత ఏడు రోజులుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించగా శుక్రవారం గూడూరు ప్రాథమిక పాఠశాలలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరమణారెడ్డి హాజరై ప్రత్యేక శిబిరంపై సేవా కార్యక్రమాలను, వాలంటీర్ల అనుభూతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నాగరాజు, రవీందర్, ప్రవీణ్‌కుమార్, లింగరాజు, ఎల్లయ్య, వీరబాబు, శ్రీనివాస్‌రావు, స్వప్న, పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి

ప్రజాపక్షం/మిర్యాలగూడ : ఈనెల 16 నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధులు కేటాయింపులు ఉండాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. మహిళలకు రూ.2500, పెన్షన్ల పెంపుదల, అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలని అన్నారు. కార్యక్రమంలో డబ్బికార మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, శశిధర్‌రెడ్డి, మంగారెడ్డి, రవినాయక్, పరుశురాములు, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

## అంగన్వాడిలో అక్షరాభ్యాసం నిర్వహించిన సర్పంచ్

ప్రజాపక్షం/వలిగొండ : మండల పరిధిలోని లింగరాజుపల్లి గ్రామంలో శుక్రవారం అంగన్వాడి కేంద్రంలో సర్పంచ్ బుడిగే లింగస్వామి విద్యార్థులచే అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించి పిల్లలకు అన్న ప్రసన్న నిర్వహించారు. అనంతరం అంగన్వాడి సిబ్బందితో కలిసి సంపత్తి భోజనం చేశారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఎగ్జామ్ సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు అంగన్వాడి టీచర్ శోభ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాలకు సమాజంలో గుర్తింపు

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సి పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్స్ ఎగ్జామినేషన్ మెటీరియల్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్ పాల్గొని విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు విద్యా ద్వారానే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చదువు ఎక్కడ నిర్లక్ష్యం చేయకూడదని మీ యొక్క భవిష్యత్తుకు మొదటి మెట్టుగా భావించి ముందుకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ విద్యతో పేదరికం నిర్మూలించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేందర్, సైదారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

## కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** వేసవిలో తాగు, సాగునీటికి కొరత లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరాను అందించాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి హైద్రాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులతో సాగు, తాగునీరు, ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి రిజర్వాయర్లు తదితర వివరాలన్నింటిని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకోని ఆయా రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ప్రాంతంలో కూడా పంటలు దెబ్బతిన్నాయనే అవపాదు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురికావద్దని, గృహ అవరసరాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్ర స్థాయిలో ఖండించారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పునరుద్ధరణీయ ఇంధనంతోనే భవిష్యత్తు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి,పునరుద్ధరింపదగిన ఇంధన వనరులపై విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధకులు దృష్టి సారించాలని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫసర్ పి.జలపతి పిలుపునిచ్చారు. రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రీన్ ఎనర్జీ రిసోర్సెస్ క్లీన్ ఎన్విరాన్మెంట్ ఇన్ ఇండియా అనే అంశంపై జాతీయ సదస్సు శుక్రవారం ముగింపు కార్యక్రమం మొదటి సెషన్‌లో ఆయన ప్రసంగించారు. సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో గ్రీన్ మెథడ్స్, నానోమెటీరియల్స్ పాత్రను ఆయన వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫసర్ డిఎ పద్మావతి మాట్లాడుతూ వివిధ శక్తి వనరుల ఉపయోగాలు వాటి పరిమితులను విశ్లేషించారు. భారతదేశం 2030 నాటికి 500 జి డబ్ల్యు శిలాజ రహిత ఇంధన లక్ష్యాన్ని చేరుకోవాలని, 2070 నాటికి నెట్‌జీరో సాధించే దిశగా విద్యార్థులు తమ పరిశోధనలను మళ్లించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ నవీన్ కుమార్,డాక్టర్ బొలిశెట్టి వెంకటేశ్వర్లు, డాక్టర్ అనిల్ కుమార్ బొజ్జ, డాక్టర్ ఎం.అనిల్ కుమార్ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి.మునిస్వామి,అకాడమిక్ కోఆర్డినేటర్ బి.నాగరాజు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# షిరిడి సాయి మందిరం అభివృద్ధికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** శ్రీషిరిడీ సాయి మందిరం అభివృద్ధికి ట్రస్టు సభ్యులు, భక్తులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే వీరేశం సూచించారు. శుక్రవారం నకిరేకల్లోని షిరిడీ సాయిబాబా సంస్థాన ట్రస్ట్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మందిరం ప్రతిష్టను మరింత పెంచేందుకు, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ట్రస్టు పని చేయాలన్నారు. అంతర్గత సమస్యలుంటే సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకెళ్లాలన్నారు. ట్రస్ట్ నూతన అధ్యక్షుడిగా తోనుకునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గట్టు శ్యామ్ సుందర్, నోముల గోవిందరాజులు, ప్రధా కార్యదర్శిగా యాట మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా బాణాల రామ్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. శాశ్వత అధ్యక్షులు కాసంలింగయ్య గౌరవ అధ్యక్షులుగా వనమా వెంకన్న, సంయుక్త కార్యదర్శులుగా తోనుకునూరి రాంబాబు, బండారు వేణు పిల్లలమర్రి సునీత ఆర్గనైజర్ సెక్రెటరీగా వెంకటరమణ దాచేపల్లి శ్రీనివాస్ వలిశెట్టి స్వప్న కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ ఛైర్మన్ రజిత, కౌన్సిలర్ సుకన్య, భజన మండలి సభ్యులు, నాయకులు సన్మానించారు.

# పది ఫలితాలలో 10 జిపిఎ సాధించి మంత్రి కోమటిరెడ్డికి గిఫ్ట్ ఇవ్వాలి



## బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పదవ తరగతి పరీక్షల్లో ప్రతీక్ ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాల బోట్టుగూడ హైస్కూల్ విద్యార్థులు 10 జిపిఏ సాధించి చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మేయర్ బుర్రి చైతన్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బొట్టుగూడ 10వ తరగతి విద్యార్థులకు కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో ఫ్యాడ్, పెన్నులను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 10 తరగతి విద్యార్థులు 10 జిపిఎస్ సాధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి గిఫ్ట్ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రతిక్ ఫౌండేషన్ సీఈవో ఎం.గోనా రెడ్డి, పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపల్ సుధారాణి, సలీం,గిరిబాబు,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పొన్నం విజయం పట్ల హర్షం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో టీపీసీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ విజయం సాధించడం పట్ల టిపిసిసి నల్లగొండ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ నాంపల్లి నరసింహ, జిల్లా కన్వీనర్ ఎండి అఫ్రోజ్ ఖాన్, రాష్ట్ర కో కన్వీనర్ ఎస్.మధుసూదన్లు హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం హైదరాబాదులో పొన్నం ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఎన్నికలలో సభ్యునిగా పొన్నం అశోక్ గౌడ్ తొలి విజయాన్ని సాధించారని అన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** అంగన్వాడి వర్కర్ల వేతనాలు పెంచడంతో పాటు యాప్ విధానాన్ని రద్దు చేసి, ఖాళీగాఉన్నటీచర్లు, హెల్పర్లు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మార్చి నెలలో జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఈ సమస్యలను ప్రస్తావించి పరిష్కారం చూపాలని కోరుతూ అంగన్వాడి సంఘం నాయకులు శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షురాలు పొడిశేటి నాగమణి, నకిరేకల్ ప్రాజెక్టు కార్యదర్శి బందనాదం ఫాతిమ, సిఐటియూ నాయకులు లకపాక రాజయ్య, ఆదిమల్ల సుధీర్, రామనశ్రీ, ఎస్కే లతీఫా, మంగ సుస్మిత, లలిత, విజయలక్ష్మి, వెంకటమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సమతా సైనిక్ దళ్ ఆవిర్భావ వేడుకలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో వైభవంగా నిర్వహించారు. సమతా సైనిక్ దళ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు బిక్షపతి దళం యొక్క నీలి జెండాను ఆవిష్కరించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏకుల సురేష్, దేవరకొండ మాజీ అధ్యక్షులు ఆదేపు సతీష్, చంటి, హనుమంతు, ఏడుకొండలు, రేవంత్, అరుణ, పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్లాస్, కుర్చీలను బహుకరించిన పూర్వ విద్యార్థులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని కల్మల్‌చెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు 30వేల రూపాయల విలువైన గ్లాస్, కుర్చీలను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడమర్తి వీరబాబు పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వరగాని వెంకటేశ్వర్లు, బచ్చలకూర నాగయ్య, శ్రీనివాసరెడ్డి, విజయ్‌భాస్కర్, ఆంజనేయులు, జ్యోతి, ప్రవీణ్, శ్రీనివాస్, సైదులు, సత్యనారాయణరెడ్డి, జానకిరామ్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

# కెజిబివిలో మెడికల్ క్యాంపు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం, ఆర్‌బిఎస్‌కె టీం ఆధ్వర్యంలో కెజిబివి పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నరేష్ మాట్లాడుతూ విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామని తెలిపారు. రేపటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థినులకు 14416 హెల్ప్‌లైన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చత్రునాయక్, డాక్టర్లు ఆరీఫ్, ధర్మతేజ, సూపర్‌వైజర్ అంజయ్య, శైలజ, నాగరాజు, ఎఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

# 69 ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 14 నుండి ఏప్రిల్ 16 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆయా పరీక్షా కేంద్రాలలో 69 ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ తెలిపారు. సంబంధిత వైద్యాధికారులు ఈ కేంద్రాలకు పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. విద్యార్థులు పరీక్షకు వచ్చేటప్పుడు ఖాళీ కడుపుతో కాకుండా అల్పాహారం స్వీకరించి హాజరుకావలెనని తెలిపారు. తమ వెంట త్రాగునీటి బాటిల్ ఉంచుకోవాలని, ప్రయాణాల యందు ఎండ సోకకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పూర్తి ఆరోగ్యంతో పరీక్షలకు హాజరై మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని నాగులపాటి అన్నారం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల పాత్రలను పోషించి, ఒక రోజు పరిపాలన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సక్రు నాయక్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, సమాజం పట్ల, ప్రభుత్వ వ్యవస్థల పట్ల అవగాహన కల్పిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిక్షం తదితరులు పాల్గొన్నారు.





## ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం దాడులు

### 36 సిలిండర్లు పట్టివేత

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం ఎఫెక్ట్ కారణంగా గ్యాస్ నిల్వలపై అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను వ్యాపార సముదాయాలకు ఉపయోగించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.వెంకటేష్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని మంజీరా హోటల్, హైద్రాబాద్ బిర్యాని, రూబీ హోటల్‌తోపాటు పలు హోటళ్లు, దాబాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రీఫిల్లింగ్ కేంద్రాల్లో డొమెస్టిక్ సిలిండర్స్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేసి 36 సిలిండర్లను స్వాదీనపరుచుకున్నారు. దాడుల్లో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌లు ఆర్.సైదులు గౌడ్, ఎండి.ముక్తార్, ఏ.దీపక్, ఆర్.జ్యోతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఎస్.రవీందర్‌రెడ్డి, సైదులు, కుమార్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సైదులు ఉన్నారు.

## ట్రస్టు సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/మునగాల:** స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మునగాల గ్రామంలో హైద్రాబాద్‌లోని మలక్‌పేట యశోధ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కోదాడ మాజీ సర్పంచ్ పయిడిమర్రి సత్యబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీసాయి గాయత్రి విద్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని పాఠశాల ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్ తెలిపారు. పేద ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి వాడాల్సిన మందులను వివరించారు. ఈ క్యాంపు ద్వారా 500 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, షుగర్, బిపి, ఇసిజి, 2డి ఇసిహెచ్‌వో, థైరాయిడ్, ఎముకల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారతి ట్రస్టు ప్రధాన కార్యదర్శి చారుగండ్ల రాజశేఖర్, ఓరుగంటి కిట్టు, యదా సుధాకర్, వంకాయల స్వాతి ట్రస్టు సభ్యులు హైమావతి, శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాలేరువాగులో పడి ఒకరు మృతి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** పొలం వద్దకు వెళ్లేందుకు పాలేరు వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన అనంతుల లింగయ్య రోజు మాదిరిగా గ్రామ శివారులోని తన పొలం వద్దకు వెళ్తుండగా వాగులో పడి మృతిచెందినట్లు తెలిపారు. శుక్రవారం 5గంటల సమయంలో సమీపంలో మృతదేహం వాగులో లభ్యమైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కుమారుడు అనంతుల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మొల్లమాంబ జయంతి

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో కుమ్మర సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. రామాయణ తొలి తెలుగు అనువాద రచయిత్రి మొల్లమాంబ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేసి కుమ్మర కుల బాంధవులకు మొల్లమాంబ జయంతి శుభాకాంక్షలు తెలియచేశారు. మండల అధ్యక్షుడు ఊట్కూరి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ జయంతి కార్యక్రమంలో రాజకీయ విభాగం మండల అధ్యక్షులు ఊట్కూరి నరసింహ, పట్టణ అధ్యక్షులు ఊట్కూరి సత్యనారాయణ, ఊట్కూరి కృష్ణ, ఊట్కూరి విజయ్, ఊట్కూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత జాబితాలో చేర్చిన ఇళ్లు, భూములను వెంటనే తొలగించాలి

### మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**ప్రజాపక్షం/ఆలేరు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను వ్యవసాయ భూములను ప్రొహిబిట్ జాబితాలో పెట్టిన వాటిని ప్రొహిబిట్‌లో నుండి తీసేసి బాధితులకు న్యాయం చేయాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరు పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆమె పాల్గొని బాధితులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గొంగిడి సునీతా మాట్లాడుతూ 22ఎ యాక్ట్ 1908, పిఒటి యాక్ట్ 1977 ప్రకారం అనేక ఇళ్లు, భూములను ప్రొహిబిట్ జాబితాలో చేర్చడం వల్ల మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎన్నో ఏళ్లుగా తాము నివాసం ఉంటూ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తుంటే ప్రభుత్వం అకస్మాత్తుగా ప్రొహిబిట్ జాబితాలో చేర్చడంతో క్రయ విక్రయాలకు వీలులేకుండా, రిజిస్ట్రేషన్ కాకుండా నిలిచిపోయాతాని దీనివల్ల ఆర్థికంగా కుటుంబాలు నష్టపోతున్నాయని, కొందరు బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఈ సమస్యపై ప్రజల పక్షాన నిలుస్తుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారి తరపున పోరాటం కొనసాగిస్తామని అవసరమైతే హైకోర్టును కానీ సుప్రీంకోర్టును కానీ ఆశ్రయించి బాధితులకు న్యాయం జరిగే వరకు గొంగిడి సునీత ఊరుకోదని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్ గౌడ్, మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మొరిగాడి వెంకటేష్ గౌడ్, కుండే సంపత్, దయ్యాల సంపత్, పత్తి వెంకటేష్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

# మేము ఒకే కుటుంబ సభ్యులం, కళామ్మతల్లి బిడ్డలం




**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** అన్నాదమ్ముల్లుగా తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయాయే తప్పా నాటకరంగంలో మేము ఒకే కుటుంబసభ్యులం, కళామ్మతల్లి బిడ్డలమని తెలంగాణ రాష్ట్ర కళాకారుల రంగ స్థల సమాఖ్య ఉపాధ్యక్షుడు దరుమూరి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో ఐదవ రోజు శుక్రవారం జాతీయస్థాయి పద్యనాటక, సాంఘీక నాటక పోటీలు, నృత్యాలను పారిశ్రామికవేత్త పొలిశెట్టి ధనుంజయతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. ఆంధ్ర, తెలంగాణ అన్న తారతమ్యం లేకుండా ఈ నాటిక పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు కళాభివందనాలు చేశారు. ప్రదర్శిస్తున్న నాటికలు యువతరాన్ని మేల్కొలిపే విధంగా ఉన్నాయని, అలాగే నాయకులకు తగిన సూచనలు అందించే విధంగా ఉన్నాయని, తల్లిదండ్రు వారి పిల్లలు అనుసరించాల్సిన విధి విధానాలను తెలియపరిచే విధంగా ఈ నాటికలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శివలీల నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానే ఆకట్టుకుంది. నాటిక అనంతరం నటీనటులకు నిర్వాహకులకు పారితోషికంతోపాట షీల్డ్, ప్రశంసాపత్రాలు అందించారు. కాగా శుక్రవారం ' మోహిని భస్మాసుర' పద్య నాటికను అక్కినేని సాంస్కృతిక సమాజం విజయనగరం, 'గేమ్' సాంఘీక నాటికను సిరిమువ్వ కల్చరల్ హైద్రాబాద్, 'అమ్మ చెక్కిన బొమ్మ' సాంఘీక నాటిక గోవాద క్రియేషన్స్ హైద్రాబాద్‌చే నాటికలు ప్రదర్శించబడ్డాయి. కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, అధ్యక్షుడు రామావతారం, కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ, వెంకటలక్ష్మీ నారాయణశర్మ, సాయిలు, సత్యనారాయణచారి, లక్ష్మయ్య, ఎల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాఘవయ్య, శైలజ, సరస్వతి, నాగమని, ఉపేందర్, బాబురావు, వీరప్రతాప్, రాజారం పాల్గొన్నారు.

# పుస్తక పఠనానికి ప్రోత్సాహం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నేటి సమాజంలో సమయం దొరికితే మొబైల్ ఫోన్లలో గడిపే అలవాటు పెరిగిపోయిందని, అలాంటి పరిస్థితుల్లో పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తుందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ సహకారంతో విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్టార్ట్ లైబ్రరీ సేవ్ లైబ్రరీ నినాదంతో జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్‌పి కార్యాలయంతో పాటు నల్లగొండ సబ్‌డివిజన్ పరిధిలోని 20 పోలీస్ స్టేషన్లలో గ్రంథాలయాలను అదనపు ఎస్‌పి జి.రమేష్, డిఎస్‌పి కె.శివరాంరెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ గాదె వినోద్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సమయం దొరికితే మొబైల్ ఫోన్లలో గడిపే అలవాటు పెరిగిపోయిందని, అలాంటి పరిస్థితుల్లో పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో ముందుకు సాగేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సంబంధించిన పుస్తకాలను చదవడం ద్వారా అవగాహన పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విపంచి ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు అందోజు నాగభూషణం, సభ్యులు గడ్డం సత్యనారాయణ, డాక్టర్ బావన ఋషి, నడిగోటి శ్రీనివాస్, పోలోజు వెంకటాచారి, మేకల ప్రదీప్ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం

### ఎంఈఓ సుధాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండూరు :** చండూరులో 10వ తరగతి పరీక్షల ఏర్పాటుకు సర్వసిద్ధం చేసినట్లు ఎంఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. చండూరు మండలంలో పదవ తరగతి చదువున్న 628 మంది విద్యార్థులకు చండూరు మండల కేంద్రంలోనే మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గుండ్రపల్లి రోడ్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శిర్ధపల్లి రోడ్‌కు ఉన్న గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో , హైద్రాబాద్ రోడ్‌కు ఉన్న సన్‌షైన్ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసినట్లు విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.



## ముగిసిన శిక్షణ

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని నూతన వార్డు సభ్యులకు రెండవ బ్యాచ్‌కు తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం 2018పై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు సర్టిఫికెట్‌లను ఎంపిడిఓ చక్రాల సంతోష్ కుమార్ అందజేసి మాట్లాడారు. వార్డు సభ్యులు గ్రామాభివృద్ధిలో కీలక భాగస్వాములైనందున చట్టంపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే పారదర్శకమైన పాలన సాధ్యమవుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిఓ దయాకర్ యాదవ్, శిక్షకులు అరవింద్ నారాయణ, ఎస్‌కె సలీం, సుధాకర్, బి సతీష్, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** నేటి నుండి ఏప్రిల్ 15 వరకు నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి చత్రునాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పి ఉన్నత పాఠశాల, కెజిబివి పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జడ్పి ఉన్నత పాఠశాల కేంద్రంలో 130 మంది, కెజిబివి కేంద్రంలో 107 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కెజిబివి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ పరీక్షలను ధైర్యంగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు హాల్ టిక్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ సూపరిండెంట్ రవీందర్‌రెడ్డి, లింగయ్య, డివోలు సత్యనారాయణ, శ్రీరామ్‌రెడ్డి, ఎస్ఓ శైలజ, సిఆర్‌పి సాయిలు, రాతికిండి రామకృష్ణ, అమరవరపు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో చైన్ స్నాచింగ్

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండల కేంద్రంలో ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు తాడు దొంగతనం జరిగిన ఘటన కలకలం రేపింది. శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో తిరుమలగిరి గ్రామానికి చెందిన బత్తుల సందమ్మ తన ఇంట్లో ఒంటరిగా ఉండగా, ముఖానికి మాస్క్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమె మెడలో ఉన్న సుమారు ఒక తులం నల్లపూసల బంగారు తాడును బలవంతంగా గుంజుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనతో వృద్ధురాలు తీవ్ర భయాందోళనకు గురైంది. ఈ విషయాన్ని బాధితురాలి కోడలు బత్తుల లక్ష్మమ్మ పోలీసులకు తెలియజేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు ప్రారంభించి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీని పరిశుభ్రమైన మున్సిపాలిటీగా చూసుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు భాగంగా7,8,9,వార్డుల్లో పరిసరాలను పర్యవేక్షించి వాటిని సిబ్బంది సాయంతో శుభ్రం చేయించారు. అపరిశుభ్రత వాతావరణ వలన అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ఆయా వార్డుల కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు పరిసరాలను పర్యవేక్షిస్తూ పరిశుభ్రంగా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఆయన వెంట కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, మజాహర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

### ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్ కాలనీ ప్రభుత్వ ఎస్‌వీఏఆర్ మోడల్ హై స్కూల్‌లో నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శేషు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో మొత్తం 156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షలు సజావుగా రాయడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాజబాబు పాల్గొన్నారు.

## గ్యాస్‌పై ఆందోళన అవసరం లేదు

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

### బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు.. రెండు రోజుల్లో 124 సిలిండర్లు స్వాధీనం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఇరాన్ ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ ప్రభావం కారణంగా గ్యాస్ సరఫరాలో కొంత జాప్యం జరుగుతున్నప్పటికీ, జిల్లాలో గ్యాస్ కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఉన్న 33 గ్యాస్ ఏజెన్సీల నివేదికల ప్రకారం గ్యాస్ బుకింగ్ చేసిన వినియోగదారులకు సుమారు నాలుగు నుంచి ఐదు రోజులలో సరఫరా జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ఏజెన్సీల వద్ద 8,118 సిలిండర్లు నిల్వలో ఉన్నాయని చెప్పారు.

# ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు ముమ్మరం

### దామెరలో సీసీ రోడ్లు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం వేగవంతం



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని దామెర గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని గ్రామ సర్పంచ్ జిల్లా శోభా సహదేవ్ తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సిసి రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.గ్రామంలోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేసే క్రమంలో వర్షాకాలంలో బురదమయంగా మారే వీధులను గుర్తించి అక్కడ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. పనులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పథకం కింద ప్రహరీ గోడ నిర్మాణ పనులు కూడా చేపట్టారు. పాఠశాల ఆవరణలోకి పశువులు లేదా అపరిచితులు రాకుండా ఉండేందుకు ఈ గోడ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాటగోని శంకర్ యాదవ్, వార్డు సభ్యులు పూదరి సైదులు, కడారి పెద్దలు యాదవ్, దాసరి లక్ష్మణ్, దామెర ఇలేందర్, గ్రామ పెద్దలు కట్ల యాదగిరి రెడ్డి, బచ్చనబోయిన నరసింహ, గున్న గుని నాగార్జున యాదవ్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధే లక్ష్యం

### సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు

**ప్రజాపక్షం/నాంపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు సిసిరోడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామంలో సుమారు 300 మీటర్ల పొడవుతో, రూ.5 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. వర్షాకాలంలో తారు రోడ్లు దెబ్బతిని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారం కోసం ఈ సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. సిసి రోడ్ల నిర్మాణంతో ధూళి సమస్య తగ్గడంతో పాటు రాత్రి సమయంలో వెలుతురు ప్రతిబింబించి రోడ్లు స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే సమస్యకు కూడా ఈ రోడ్ల నిర్మాణం ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుషిపాక యాదయ్య, వార్డ్ సభ్యులు శంకర్, అశోక్, లక్ష్మమ్మ, గుడి చైర్మన్ వట్టి కోటి యాదయ్య, పోలగోని సత్తయ్య, అంజయ్య, జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ),జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం టిటిడిసి ప్రాంగణంలోని జడ్‌ఎస్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు,ఆర్‌టిసి బస్సులు, సోలార్ ప్లాంట్లు వంటి అవకాశాలు కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఓ పి.శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామాలు, మండల స్థాయిలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. గ్రామ సంఘాల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి స్వయం సహాయక సంఘాల సమావేశాలను సక్రమంగా నిర్వహించి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆవుల మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ అదనపు పిడిఎం. శ్రవణ్ కుమార్, డిపిఎంలు డి.మోహన్ రెడ్డి, రామలింగయ్య, ఎస్.శ్రీనివాస్, సోమయ్య, జడ్‌ఎస్ కార్యదర్శి సరిత, కోశాధికారి సునితతో పాటు జిల్లాలోని అన్ని మండలాల మహిళా సంఘాల అధ్యక్షులు, ఓబీ మహిళా సిబ్బంది, జిల్లా సమాఖ్య మేనేజర్ అనిత పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/గుండాల:** లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక సబ్ స్టేషన్ వద్ద బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బిజెపి కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు కాలి శ్రీను ఆధ్వర్యంలో ఏఈ నర్సింహాకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లో వోల్టేజ్ సమస్య వలన మోటార్లు, స్టార్టర్లు కాలిపోవడం జరుగుతుందని, ఈ లో వోల్టేజ్ సమస్యల వలన రైతులకు ఇబ్బందికరంగా మారడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పాడుతుందని అన్నారు. మండలంలో సబ్ స్టేషన్ నిర్మించినట్లయితే లో వోల్టేజ్ సమస్య ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురేష్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, బిజెవైఎం మండల అధ్యక్షులు సోమరాజు, నాయకులు సాయితేజ, కిషోర్, మైపాల్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామ పంచాయతీగా గోనకోల్

**ప్రజాపక్షం/డిండి:** గోనకొల్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామ పంచాయతీగా చేయడమే లక్ష్యమని అందుకు ప్రజలందరూ సహకరించాలని గోనకొల్ గ్రామ సర్పంచ్ కొసిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పంచాయతీ పాలక వర్గ సభ్యులు, ప్రజలతో కలిసి వార్డులలో రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. ఇంటి పరిసరాల్లో నీటి సంపుల్లో నిల్వ ఉంచిన నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చేశారు. పాఠశాల పరిసరాల్లో చెత్త కాగితాలను తొలగించి పారిశుద్ధ్య పనులను చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రణిత ప్రసన్న, వార్డు సభ్యులు చంద్రమౌళి, దీపికా, గ్రామ ప్రజల్లు, పంచాయతీ కార్యదర్శి గీత, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/చండూరు :** మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన బోయపల్లి మహేష్ కొద్ది కాలం క్రితం బైక్ ఆక్సిడెంట్ కావడంతో కాలుకి ఆపరేషన్ అయ్యి ఇంట్లోనే ఉంటు ఆర్థిక సమస్యతో బాధపడుతున్నాడు. ఇట్టి విషయాన్ని గ్రామానికి చెందిన గునగంటి లింగస్వామి చరవాణి ద్వార టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్రామ్ రెడ్డి కి తెలియపర్చగానే వెంటనే స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్రామ్ రెడ్డి ఫౌండేషన్ సభ్యుడైన పెసర్ల హరీష్ ద్వార రూ.15వేల నగదును శుక్రవారం కొండాపురంలో బోయపల్లి మహేష్‌కు అందింపజేశారు. ఈ కార్యక్రమంలో గిరి శివ, సిలివేరు మహేష్, చెడుబుద్ధి వెంకన్న, మంగలపల్లి శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

# మొల్లమాంబ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండల కేంద్రంలో ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను కుమ్మరి సంఘం ఆధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలేరు మండల అధ్యక్షుడు గంగాధరి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొని మొదటగా ఆలేరు బస్టాండ్ ముందు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరి పరమేశ్వర్, జిల్లా మీడియా విభాగం అధ్యక్షులు గంగదారి శ్రావణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి జీవిలకపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శనిగరం హరీష్, కొరుటూరి బిక్షపతి, గంగాధరి ఇస్తారి, కొరుటూరి బాలరాజు, గంగాధరి సత్తయ్య, కొరుటూరి నరసింహులు, కట్కూరి సిద్ధులు, గంగాధరి సాయికిరణ్, తాడూరి భాస్కర్, కొరుటూరి ఉపేందర్,గంగాధరి మహేందర్,గ్రామ అధ్యక్షులు గంగాధరి పరమేష్,శనిగరం రవీందర్, తాడూరి గణేష్, నిడిగొండ ఆంజనేయులు, గంగాధరి శ్రీనివాస్, కట్కూరి బాలస్వామి, కొరుటూరి శ్రీనివాస్, కట్కూరి రవి, తేరాల సిద్ధులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మార్చి 13 తెలుగుజాతి కవయిత్రి కుమ్మర్ల మాతృమూర్తి శ్రీ మొల్లమాంబ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని బీబీనగర్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షులు దేవరుప్పల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం మండల నాయకులు దేవరుప్పల రామచందర్, నెల్లుట్ల బాలకృష్ణ, దేవరపల్లి రమేష్, కొలిచెర్ల రమేష్, రాము, రజిని, దేవరపల్లి శ్రీకాంత్, నెల్లూరు లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** సుప్రసిద్ధ తొలి తెలుగు మహిళా కవయిత్రిగా శ్రీ మొల్లమాంబ 16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో పేరు గాంచిందని దేవరకొండ నియోజకవర్గ కుమ్మరి సంఘం అధ్యక్షుడు తోటపల్లి కిరణ్ అన్నారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మొల్లమాంబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, అరటిపండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు బొడ్డుపల్లి ఎల్లయ్య, నీలకంఠం రాములు, ఏరుకొండ రాము, మాడ్గుల యాదగిరి, సిలివేరు శ్రీధర్, తోటపల్లి వెంకటయ్య, మల్లయ్య, రాంబాబు, మల్లిఖార్జున్, గోపి, నాని పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** తెలుగు సాహిత్య ఆదికవయిత్రి మొల్ల అని కుమ్మరి సంఘం నాయకులు నీలకంఠం జయరామకృష్ణ అన్నారు. మొల్లమాంబ జయంతి సందర్భంగా శుక్రవారం కుమ్మర సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు కుమ్మరి మహిళలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కుమ్మర సంఘం నాయకులు నీలకంఠం జయరామకృష్ణ ధరణిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దండ సునంద వెంకట్‌రెడ్డి, నీలకంఠం వెంకటేశ్వర్లు వసంత, నీలకంఠం సత్యం సరస్వతి, చలిగంటి పుల్లారావు, నీలకంఠం మహేష్ శోభ తదితరులు పాల్గొన్నారు.